
# గ్లోబల్ విలేజ్

## వద్దెంపూడి ఫణిభూషణ్



ఇది ఎప్పటి వైరమో? ఏనాటి నుంచి రగులుతూ ఉందో? మా ఇంటికి, మా బాబాయి వాళ్ల ఇంటికి మధ్యన గల పెరటి స్థలం ఎవరికి చెందాలి అనే విషయం వివాదంగా మారి దశాబ్దాలుగా రగులుతూ వున్నది. అసలు నిజానికి ఆ పెరటి స్థలం కాంపౌండ్ వాల్‌తో సహా నిర్మింపబడి మా ఇంటి ఆవరణలోనే భాగమయి ఉంది. మా వద్దనున్న డాక్యుమెంట్లలో ఆ స్థలం కూడా ఉదహరింపబడింది. కానీ ఛాందస భావనలు మూర్తీభవించిన మా దాయాదులు మాత్రం వాస్తు సిద్ధాంత ప్రకారం ఆ స్థలం తమకే చెందాలని వితండవాదం చేస్తూ, నిత్యం మమ్మల్ని శత్రువులుగా పరిగణిస్తూ రకరకాల మార్గాల ద్వారా మా కుటుంబాన్ని ఇబ్బందుల పాల్జేస్తున్నారు.

వాటన్నిటిలో ముఖ్యమైనది– మా పెరటి స్థలం వైపున గల ప్రహరీగోడ పైగుండా వాళ్ల ఇంటిలోని చెత్తాచెదారం, కోడిగ్రుడ్డు పెంకులు, ఇతరత్రా భరింపలేని 'తీవ్ర' మాలిన్యాన్నంతా మావైపు విసురుతూ ఉండడం. ఆ మాలిన్యాన్నంతా మేము ఎంతో వ్యయప్రయాసలకోర్చి శుభ్రం చేసుకుంటూ అనుదినమూ జాగరూకతతో మా పెరడుని కాపాడుకోవలసి వస్తున్నది. ఈ మా దాయాదుల దుష్ప్రవర్తన గూర్చి మా గ్రామ రచ్చబండ దగ్గిర కూడా ఎన్నోసార్లు మేము ఫిర్యాదు చేశాం. కానీ మా బాబాయి మాత్రం 'అదంతా తన పని కాదని, కేవలం మా పెరటి

స్థల వివాదం నుంచి గ్రామాన్ని దృష్టి మరల్చేటందుకు మేము కావాలని చేస్తున్న దుష్ప్రచారమ'ని మాపైనే ప్రత్యారోపణ చేస్తూ, ఈ సమస్యకంతటికి మూలకారణమైన పెరటిస్థల వివాదం గూర్చి కూడా రచ్చబండ దగ్గిరే తేల్చమని పట్టుబడుతూ, సమస్యను ప్రక్కదోవ పట్టించి తనవైపు మళ్లించుకునే కుటిల పన్నాగాలు పన్నుతున్నాడు. మా నాన్నగారు మాత్రం వీటి వేటికి బెదరక, ఆ స్థలం ఏనాడో పూర్వీకుల ద్వారా తన వాటాకి సంక్రమించిన అవిభాజ్యమయిన ఆస్తి అని, ఈ విషయంలో ఎవరి జోక్యానికి తావులేదని, అంతగా మా బాబాయి మాట్లాడుకొనాలనుకుంటే 'డాక్యుమెంట్లలోని అంశాలకు' లోబడి చర్చలకు వస్తే ఏనాడయినా తాను చర్చలకు సిద్ధమేనని చెప్పారు. కానీ ఛాందసవాదం మూర్తీభవించిన మా బాబాయి మా డాక్యుమెంట్లను గౌరవించడం లేదు. తనకు అనుకూలంగా తనకు తానే అన్వయించుకున్న ఛాందస వాస్తు సిద్ధాంతం ఆధారంగా స్థల పంపకం తిరిగి జరగా లంటున్నాడు. మా నాన్నగారు తలచుకుంటే ఏనాడో ప్రహరీగోడ దూకి వెళ్లి, మాలిన్యాలతో మా పెరడుని నాశనం చేస్తున్న మా బాబాయి గూబ గుయ్‌మనిపించేవారే. కానీ గోడ దాటి వాళ్ల ఇంట్లోకి వెళ్లి వాళ్లనే కొట్టామని అందరూ ఆయన్ని తప్పు పడ్తారని, అందువలన ఇప్పటివరకూ గ్రామంలో మా మంచితనం పట్ల అందరికీ వున్న సానుభూతి పోతుందని ఆయన భయం. అందుకే నాన్నగారు, బాబాయి ఎంతగా రెచ్చగొట్టినా కూడా గోడ దాటకుండా ఓర్పు వహిస్తూ, మౌనంగా, మా పెరడులోనికి అత్యంత హేయంగా రవాణా అవుతున్న మాలిన్యాన్ని శుభ్రం చేసుకోవడంలోనే నిమగ్నమైయున్నారు.

మా బాబాయి తన ఇంట్లో నాటుబాంబులు కూడా తయారు చేసుకుని ఉన్నాడని ఎవరి ద్వారానో మా నాన్నగారికి తెలిసింది. ఏదో ఓనాడు మా రెండు కుటుంబాల మధ్య పెద్ద గొడవే గనుక జరిగిన పక్షంలో మాపై ఉపయోగించడానికే ఆయన ఆ నాటుబాంబులు తయారు చేసుకున్నాడని తెలిసింది. ఒకవేళ అలాంటిదే గనుక జరిగితే మేమూ ఏమీ తీసిపోలేదు అని హెచ్చరికగా చెప్పాలనే ఉద్దేశ్యంతో మేమూ ఓ నాటుబాంబు తయారుచేసి రోడ్డు మీద పేల్చాం. మేము అలా పేల్చామో లేదో, మా బాబాయి కూడా గభాల్న ఇంట్లోకి పరుగెత్తుకుంటూ వెళ్లి, అల్రెడీగా వున్న ఓ నాటుబాంబుని రపాల్మని తన భాగం రోడ్డు మీద పేల్చేసుకున్నాడు.

ఆ రెండు మోతలకి మా గ్రామం మొత్తం దద్దరిల్లింది. మా గ్రామ పెద్దన్న అమరయ్య మా ఇరువురి వ్యవహారంపై కళ్లెర్రజేశాడు. మా మీద ఆంక్షలని విధించాడు. కొన్నాళ్లు మాకు బజార్లో కావలసిన సరుకులు కూడా ఎవరూ అమ్మలేదు. ఎంతటి అవసరాలకయినా మాకు ఊళ్లో అప్పు కూడా పుట్టింది కాదు. తర్వాత తర్వాత వాళ్లే వాళ్ల వ్యాపారాలు, వడ్డీలు నష్టపోకూడదని మళ్లీ మామూలుగానే అన్నీ ఇచ్చి పుచ్చుకుంటున్నారు. నిజానికి మా గ్రామ పెద్దన్న అమరయ్యకి మాపై అంతటి కోపం రావడం చూసి, ఆయనకు నాటుబాంబులంటే గిట్టదనుకొంటారేమో!? అదేం లేదు. ఆయన వ్యవసాయ గోదాములో కనీసం ఓ రెండు వేలయినా నాటుబాంబులు ఉన్నాయని ఊళ్లో అందరూ చెప్పుకొంటుంటారు. ప్రత్యర్థులకు సింహస్వప్నంలా ఉండేందుకు వాటిని ఆయన ఎప్పటినుంచో నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ ఊళ్లో ఆయన ప్రత్యర్థులు ఐదారుగురి వద్ద ఆ బాంబులు ఉన్నాయి. మళ్లీ మాలాంటి చిన్నాచితకా లాంటి వాళ్లు కూడా నాటుబాంబుల రుచి మరిగితే, అది అటు తిరిగి ఇటు తిరిగి మేము కూడా ముదిరిపోయి, ఆయన్ని సవాల్ చేస్తామని ఆయన భయం. అప్పటికీ గ్రామ పెద్దన్న అమరయ్యతో నాన్నగారు వినయంగా, "మేము ఈ బాంబుని స్వీయ రక్షణ కోసమే తయారు చేసుకున్నాం తప్ప గ్రామాధిపత్యంపై తమకేమాత్రం ఆసక్తి లేద"ని చెప్పారు.

అసలు నిజం చెప్పాలంటే మా బాబాయి స్వయంగా ఈ బాంబులు చేశాడంటే మేము నమ్మలేకపోతున్నాం. ఎందుకంటే, వాటి తయారీకి కావలసిన తెలివితేటలు గానీ, సాధనా సంపత్తి గానీ ఆయనకు లేవు. ఆ తయారీకి కావలసిన సరుకూ సరంజామా యావత్తూ మా బాబాయికి మా ఉత్తరం ప్రక్కింటి చెన్నయ్య అనే ఆయన అందించి ఉంటాడని మా విశ్వాసం. చెన్నయ్య మాత్రం పైకి మమ్మల్ని, "భాయీ భాయీ" అంటూనే మా వెనకాలే గోతులు తవ్వుతున్నాడని మా అందరికి కూడా ఓ పెద్ద అనుమానం.

ఉన్నట్లుండి ఊళ్లో ఓ రసవత్తరమైన సంఘటన జరిగింది. మా గ్రామ పెద్దన్న అమరయ్య తాలూకు వ్యక్తుల్ని కిరాతకంగా కొట్టిన ఓబులయ్య అనే ఓ కరడుగట్టిన రౌడీ, ఆ తర్వాత పారిపోయి మా బాబాయికి అత్యంత ఆప్తుడైన ఓ స్నేహితుడింట్లో తలదాచుకున్నాడు. తన మనుషులపైనే దాడిచేసి, తమ గ్రామ పెద్దరికాన్నే సవాల్ చేసిన ఆ ఓబులయ్యను పట్టుకుని బుద్ధి చెప్పాలని పాపం అమరయ్య మా బాబాయి ద్వారా ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ ఓబులయ్యకు ఆశ్రయం కల్పించిన మా బాబాయి ఫ్రెండ్ మాత్రం ఖరాఖండిగా చెప్పేశాడు– "ఓబులయ్య మా అతిథి. మా సంప్రదాయం ప్రకారం అతిథిని ఎవ్వరికీ బందీగా పట్టించబోము" అని. అసలీ ఓబులయ్య కూడా ఒకానొకప్పుడు అమరయ్య మనిషేనట. పెద్దన్న వేరే ఏవో గొడవల కోసం ఓబులయ్యను పరోక్షంగా పెంచి పోషించాడు. ఇపుడా గొడవలు సమసిపోయి ఓబులయ్యతో అవసరం తీరిపోయింది. ఈలోగా ఓబులయ్య ఏకు మేకై, "అసలు నా ప్రధాన శత్రువు అమరయ్య. అమరయ్య గ్రామ పెద్దరికాన్ని నాశనం చేయడమే నా లక్ష్యం. అమరయ్య మనుషుల్ని నేనే కాదు నాకు సంబంధించిన వారెవ్వరు కొట్టినా సరే అది పవిత్ర కార్యంగా భావిస్తాను" అని తీర్మానించేశాడు. ఈ వ్యవహారంలో పెద్దన్నకు తల బొప్పి కట్టినంత పనయింది.

ఒకానొక శుభ ముహూర్తంలో మా బాబాయి మనసు మారింది. ఆయన మాతో సఖ్యంగా నడచుకుంటూ, పెరటి వివాదాన్ని తాత్కాలికంగా ప్రక్కనబెట్టి, సాధారణ బంధుత్వం సంబంధాలు పునరుద్ధరించడానికి సిద్ధమయ్యాడు. అందరమూ "అమ్మయ్య... బాబాయి దారిలో పడ్డాడు" అనుకునేలోగా, మిలట్రీ నుంచి అప్పుడే తిరిగొచ్చిన మా బాబాయి పెద్దకొడుకు ముఖేష్ ఓ రోజున బాగా తాగొచ్చి, బాబాయిని మస్తుగా కొట్టి, చీకటింట్లో పడేసి, ఇకనుంచి అన్ని వ్యవహారాలు తనతోనే చేయాలని అందరికీ హుకుం జారీ చేశాడు. గ్రామంలో అందరూ ముఖేష్‌ని ఖండిస్తారని మేము అనుకున్నాం. కానీ అలా జరగలేదు. ఏవో కొన్ని రోజులు లాంఛనంగా ముఖేష్ ప్రవర్తనని తప్పుపట్టిన గ్రామం ఇపుడు ఆ ఇంటికి సంబంధించి ముఖేష్‌ని ముఖ్య వ్యక్తిగా అంగీకరించడం ప్రారంభించింది. అంతేకాదు, బాబాయితో సగంలో ఆగిన చర్చలు ఇపుడు ముఖేష్‌తో ప్రారంభించండంటూ కొందరు మాపై వత్తిడి కూడా తెచ్చారు. నాన్నగారి మొఖం ఎర్రగా కందగడ్డలా తయారయింది. కాస్తో కూస్తో మర్యాదస్తుడయిన బాబాయిని విచక్షణారహితంగా కొట్టి మూలన పడేసిన దుందుడుకు స్వభావి ముఖేష్‌తో, ఇంత అనుభవం రంగరించుకున్న నాన్నగారు ముఖాముఖీ ఎలా మాట్లాడతారు?

ముఖేష్ మాత్రం, "నాతో మాట్లాడాలనుకునే పెద్దమనుషులు ఎవరైనా సరే... ఊళ్లో ఏ సెంటర్‌కి రమ్మన్నా వచ్చి నేను మాట్లాడతాను" అంటూ అందరివద్దా సవాళ్లు విసురుతూనే ఉన్నాడు.

మా నాన్నగారు అప్పటికీ తన స్థాయి నుంచి కొంత దిగివచ్చి, "ముందుగా పెరటిలోనికి మాలిన్యాలు విసిరే నీచ కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని, అంతకుముందు బాబాయితో కుదిరిన పాత ఒప్పందాలు గౌరవించాలని, ఇలా చర్చలకు అనువైన వాతావరణం కల్పిస్తే, ముఖేష్‌తో మాట్లాడడానికి తనకు అభ్యంతరం లేద"ని చెప్పారు.

మా నాన్నగారు ఇలా తన స్థాయి నుంచి దిగి రావడం మాకు బాధనిపించింది.

"నాన్నగారూ! మనమేం గాజులు తొడుక్కుని లేము. అడ్డదిడ్డంగా వ్యవహరించే ఆ ముఖేష్ గాడితో ముఖాముఖీ చర్చలా!? అసలేంటి మీ ఉద్దేశ్యం?" అని నిలదీశాం.

ఆయన మమ్మల్ని సమాధానపరుస్తూ, "మీరేం భయపడవద్దు. మన జాగాలో అంగుళం కూడా నేనెవరికీ వదలబోను" అని ఖరాఖండిగా చెప్పారు.

ఈ చిన్ని గ్లోబల్ విలేజ్‌లో మా రెండు కుటుంబాల మధ్య ఈ పెరటి స్థలం వివాదం ఎప్పటికి తీరుతుందో? ఎలా తీరుతుందో? మా ఊహకి ఏమాత్రం అంతుబట్టడం లేదు. కాలమే ఈ సమస్యని పరిష్కరించాలి.

కాశ్మీర్‌లా అందమైన పూలమొక్కలూ, ఫలవృక్షాలతో నిండి మా ఇంటికే శోభాయమానమైన మా పెరడు, మా దాయాదులు విసిరే మాలిన్యాల బెడద నుంచి బయటపడి మమ్మల్ని ఆహ్లాదకరంగా ఎప్పుడు అలరిస్తుందో!?

## పట్నవాసం - పల్లెవాసం

వానలా పడవు
పంటలా పండవు
కరెంటు వచ్చేది నిల్లు
కట్టాలి మినిమం బిల్లు
పట్నవాసులకు
అధికంగా పన్ను
పల్లెవాసులకు
సబ్సిడీలే దన్ను

## పుకారు

వేగంగా వెళ్తుంది
కారు
అంతకన్నా వేగంగా
చేస్తుంది షికారు
పుకారు

– *కలవకుంట్ల*